




# DD9 వార్త

తెలుగు దినపత్రిక


## టీమిండియాలోకి 15 ఏళ్ల సంచలనం?..
## సూర్య, సంజూలకు టెన్షన్!



06

సంపుటి : 02 సంచిక : 237 హైదరాబాద్, ఏప్రిల్, శుక్రవారం 17, 2026 పేజీలు : 06 వెల : 3.00



# మహిళా రిజర్వేషన్లు హక్కు.. కానుక కాదు

**డీలిమిటేషన్‌తో ఎవరికి అన్యాయం లేదు**
**మహిళా సాధికారత దిశగా చారిత్రక అడుగు**
**రాజకీయ దురుద్దేశం అంటూ వస్తున్న ఆరోపణలు తప్పు**
**పార్లమెంట్ చరిత్రలో చిరస్మరణీయమైన ఘటన**
**మహిళలకు అవకాశమిస్తే దేశానికి కొత్త దిశ**
**రిజర్వేషన్లను వ్యతిరేకించే పార్టీలకు మహిళలే సమాధానం ఇస్తారు**
**ఉత్తరాదిదక్షిణాది వివాదాలకు తెరదించాలి**
**ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు.. అంతా తప్పుడు ప్రచారం**
**మహిళా బిల్లుకు అన్ని పార్టీల మద్దతు ఇవ్వాలి**
**దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకం**
**పార్లమెంటులో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, (డిడి9 వార్త):

దేశ రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా భావిస్తున్న మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లులపై ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చిన మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో జరిగిన చర్చలో ప్రధాని విస్తృతంగా ప్రసంగించారు. పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేమని పేర్కొన్న ప్రధాని, మహిళా రిజర్వేషన్ల బిల్లు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. ఈ చారిత్రక నిర్ణయంలో భాగస్వామ్యం కావడం తనకు గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి అంటే కేవలం మౌలిక వసతులు, రహదారులు, రైల్వేలు మాత్రమే కాదని, మహిళల స్వావలంబన కూడా అంతే ముఖ్యమని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని, రాజకీయ రంగంలో కూడా వారికి తగిన అవకాశాలు కల్పిస్తే దేశానికి మరింత మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

మిగతా 2లో..



# తెలంగాణలో భానుడి విశ్వరూపం

**అత్యధికంగా ఆదిలాబాద్‌లో 43.8 డిగ్రీలు**
**తెలంగాణలో అధికంగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు**
**ఎండ ప్రభావానికి తీవ్రమైన వేడి, ఉక్కపోత**
**మరో రెండ్రోజులు ఎండల తీవ్రత పెరిగే అవకాశం**
**ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్**

హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. మధ్యాహ్నం 12:30 నుంచి 3 గంటల మధ్య ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉండటంతో జనాలు బయటకు రావాలంటే జంకుతున్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ 43.8, నిజామాబాద్ 42.7, మహబూబ్ నగర్ 42, రామగుండం 42 డిగ్రీల మేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండవేడికి ప్రజలు అల్లాడిపోతున్నారు. తీవ్రమైన ఉక్కపోతతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అధిక ఉష్ణోగ్రతలతో వర్షా లు**

శుక్రవారం, ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఎండ

మిగతా 2లో..

# తేజస్వి సూర్యపై చర్యలు తీసుకోవాలి

**విభజనను ఇండియా–పాక్‌తో పోల్చడం చరిత్ర వక్రీకరణ**
**తెలంగాణ సాధన త్యాగాల ఫలితం**
**బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం**
**కిషన్‌రెడ్డి మౌనం బాధాకరమని వ్యాఖ్య**
**లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తాం**
**తెలంగాణనుఅవమానించిన వారిని ప్రజలే తిప్పికొడతారు**
**మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపాటు**



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాష్ట్ర సాధనపై జరుగుతున్న వ్యాఖ్యల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తెలంగాణ ఏర్పాటును అవమానించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి Ponnam Prabhakar డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను సహించబోమని స్పష్టం చేశారు.
తెలంగాణ రాష్ట్రం అనేది సాధారణ పరిపాలనా నిర్ణయం కాదని, అది ప్రజల దీర్ఘకాల పోరాటం, ఆత్మత్యాగాల ఫలితమని మంత్రి పేర్కొన్నారు. వేలాది మంది విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు తమ ప్రాణాలను అర్పించి సాధించిన రాష్ట్రాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదని ఆయన ఘాటుగా అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన పోరాటం ఫలితంగా తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. ఇటీవల భాజపా ఎంపీ Tejasvi Surya చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన మంత్రి, తెలంగాణ ఏర్పాటును ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడం చరిత్రను వక్రీకరించడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. అలాంటి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. ఈ సందర్భంలో కేంద్ర మంత్రి G. Kishan Reddy స్పందించకపోవడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. తెలంగాణకు సంబంధించిన

మిగతా 2లో..

# తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చుతారా..?

**బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించిన హరీష్‌రావు**
**తెలంగాణ ఏర్పాటు పాకిస్తాన్ విభజనతో పోల్చిన తేజస్వి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం**
**పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించినందుకు క్షమాపణ చెప్పాలి**
**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దశాబ్దాల పోరాటం హరీష్‌రావు**



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించిన తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన

మిగతా 2లో..

# యూఏఈ దెబ్బకు పాకిస్థాన్ అబ్బా..




**తక్కువ ఆదాయం, ఎక్కువ ఖర్చులతో ఇబ్బంది**
**క్రెడిట్ కార్డుల అప్పుల్లో చిక్కుకున్న ఉద్యోగిలా పరిస్థితి**
**విదేశీ మారక నిల్వలు తగ్గడం**
**దేశ ఖర్చులను నిర్వహించలేని స్థితి**
**UAE ఇచ్చిన అప్పు వెంటనే చెల్లించమని డిమాండ్**
**గడువు విధించడం వల్ల ఒత్తిడి పెరగడం**

హైదరాబాద్, (డిడి9 వార్త):

పాకిస్థాన్ దిక్కు తోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆ దేశ ప్రధాని, ఆర్మీ చీఫ్ ఇద్దరూ గిన్నెలు పట్టుకుని భిక్షం అడుక్కునే స్థాయికి దిగజారారు. ప్రస్తుతం పాకిస్థాన్ పరిస్థితి ఏలా తయారైందంటే.. తక్కువ జీతం ఉండి, క్రెడిట్ కార్డుల ఉచ్చులో చిక్కుకున్న ఉద్యోగిలా మారింది. సంపాదన తక్కువ,

మిగతా 2లో..

# తెలంగాణ వ్యతిరేకత బీజేపీ నరనరాన నిండి ఉంది



**తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం..**
**తేజస్వి సూర్య బేషరతుగా క్షమాపణ చెప్పాలి**
**తెలంగాణ ఏర్పాటు దేశ విభజనతో పోల్చినా...**
**తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉన్నారు**
**ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిన తీరును తెలంగాణ సమాజం గుర్తిస్తున్నది**
**తెలంగాణ వ్యతిరేకత బిజెపి నరనరాన నిండి ఉన్నది**
**తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బిజెపి భేషరతుగా క్షమాపణ చెప్పాలి : కేటీఆర్**

హైదరాబాద్, (డిడి9 వార్త):

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకారపూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని ఆయన మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోడీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే

మిగతా 2లో..

# డీలిమిటేషన్‌పై రేవంత్ తప్పుడు ప్రచారం

**కేరళ కంటే తెలంగాణలో ఎక్కువ జనాభా ఉన్నా సీట్లు తక్కువే..**
**దక్షిణాదిఉత్తరాది పేరుతో విభజన రాజకీయాలు**
**మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి**
**జనాభా ఆధారంగా సీట్ల పునర్విభజన అవసరం**
**కుల గణన సక్రమంగా జరగలేదని రాష్ట్ర ప్రభుత్వంపై**
**ఎన్నికల లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న**
**లోక్‌సభలో గందరగోళానికి కాంగ్రెస్ కుట్ర అంటూ**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**

హైదరాబాద్, (డిడి9 వార్త):

దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన డీలిమిటేషన్ అంశంపై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్రంగా స్పందించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో అనౌపచారికంగా మాట్లాడిన ఆయన, ఈ అంశంపై జరుగుతున్న చర్చలో వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ నాయకులపై

మిగతా 2లో..



## తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చుతారా.?

మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను ఒక విద్వేషపూరిత విభజనతో పోల్చడం అమరుల త్యాగాలను అవమానించడమేనని హరీష్‌రావు ధ్వజమెత్తారు.

తెలంగాణ ఆవిర్భావం రాజ్యాంగబద్ధంగా జరిగిందని, నేడు ఈ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలవడాన్ని బీజేపీ తట్టుకోలేకపోతోందని హరీష్‌రావు విమర్శించారు. "ఇండియాపాకిస్థాన్ విభజన లాంటిదే తెలంగాణ ఏర్పాటు అయితే, ఆనాడు బీజేపీ పార్లమెంట్‌లో విభజన బిల్లుకు ఎందుకు మద్దతు తెలిపింది?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోడీ గతంలో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై విషం చిమ్మారని, నేడు తేజస్వి సూర్య అదే బాటలో నడుస్తూ తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరుస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం స్పందించి తన వైఖరిని స్పష్టం చేయాలని, లేదంటే ఇది ఆ పార్టీ అధికారిక ధోరణిగానే భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రాష్ట్రం నుంచి గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, అలాగే కాంగ్రెస్ ఎంపీలు తేజస్వి సూర్య అనుచిత వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండటం సిగ్గుచేటని హరీష్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ పేరుతో ఓట్లు అడిగి గెలిచిన వీరు, ఢిల్లీ పెద్దల ముందు వంగి రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. "బీఆర్ఎస్ ఎంపీలే లోక్‌సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చేవారు" అని పేర్కొన్న ఆయన, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్న ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ అంటే ఒక పోరాట గాథ అని, స్వాభిమానానికి ప్రతీక అని హరీష్ రావు పేర్కొన్నారు. రాష్ట్ర హక్కులు, ఆత్మగౌరవంపై దాడి చేసే శక్తులను తెలంగాణ ప్రజలు ఎన్నడూ క్షమించరని హెచ్చరించారు. తెలంగాణను అవమానించే ప్రతి ఒక్కరికి ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టి సమాధానం ఇస్తామని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

## మహిళా రిజర్వేషన్లు హక్కు.. కానుక కాదు

మొదటిపేజీ తరువాయి

కల్పించడం కానుక కాదని, అది వారి హక్కు అని ప్రధాని స్పష్టం చేశారు. దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. మహిళలకు అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సమతుల్యత ఏర్పడుతుందని, దేశ అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

మహిళా రిజర్వేషన్ల అంశంపై గత మూడు దశాబ్దాలుగా చర్చలు జరుగుతున్నాయని, అయితే ఇప్పటివరకు అమలులోకి రాలేదని ప్రధాని గుర్తు చేశారు. గతంలో అనేక ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ ఫలితం సాధ్యపడలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కేంద్రం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు.

విపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ, మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రధాని హెచ్చరించారు. మహిళలు తమ హక్కుల విషయంలో వెనుకడుగు వేయరని, తమకు అన్యాయం చేసే పార్టీలను వారు క్షమించరని అన్నారు. బిల్లుకు మద్దతు ఇవ్వని పార్టీలకు రాజకీయంగా నష్టం తప్పదని సూచించారు.

డీలిమిటేషన్ అంశంపై వస్తున్న సందేహాలకు కూడా ప్రధాని సమాధానం ఇచ్చారు. ఈ ప్రక్రియ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని స్పష్టంగా చెప్పారు. ఉత్తరాది, దక్షిణాది అనే భేదాలు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి విభజన రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు.

చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతానికీ సమాన ప్రాధాన్యం కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని వివరించారు. డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాల సంఖ్య పెరగడం, పునర్విభజన జరగడం ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేయాలని ప్రధాని కోరారు. ఈ బిల్లుకు సంబంధించిన కీర్తి తనకు అవసరం లేదని, విపక్షాలు కూడా దానిని తమదిగా ప్రకటించుకోవచ్చని అన్నారు. మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని అడ్డుకోవడం కన్నా, మద్దతు ఇచ్చి తమ గొప్పతనాన్ని చాటుకోవాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా మహిళల పాత్రపై ప్రధాని విశేషంగా మాట్లాడారు. మహిళలు సమర్థులైతే కుటుంబాలు బలపడతాయని, బలమైన కుటుంబాలు దేశాన్ని బలపరుస్తాయని అన్నారు. సమాజంలో మహిళల స్థానం పెరగడం ద్వారా దేశం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బిల్లుల ద్వారా చట్టసభల్లో మహిళలకు విస్తృత ప్రాతినిధ్యం లభించే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. లోక్‌సభలోనే మహిళలకు గణనీయమైన స్థానాలు దక్కే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇది దేశ రాజకీయాల్లో పెద్ద మార్పుకు దారితీయొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తం మీద, మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లులు దేశ రాజకీయాల్లో ఒక చారిత్రక పరిణామంగా మారే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ బిల్లులు అమలులోకి వస్తే మహిళల పాత్ర మరింత విస్తరించి, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ఈ బిల్లులపై రాజకీయ చర్చను మరింత వేడెక్కించాయి. మహిళల సాధికారత, సమాన హక్కుల సాధన దిశగా ఈ చర్య ఎంతవరకు ఫలితాలనిస్తుందో రాబోయే కాలంలో స్పష్టమవుతుంది. అయితే ప్రస్తుతం మాత్రం ఈ బిల్లులు దేశ రాజకీయాల్లో ప్రధాన చర్చాంశంగా మారాయి.

## యూఏఈ దెబ్బకు పాకిస్థాన్ అబ్బా..

మొదటిపేజీ తరువాయి

ఖర్చు ఎక్కువ అన్నట్లుగా తయారైంది దాయాదిలా పరిస్థితి. తమ కడుపు నింపుకోవడానికే నాయా పైసా లేదు.. కానీ ప్రపంచ దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తూ డబ్బులు వృథా చేసుకుంటుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధం కారణంగా ఆర్థిక సంక్షోభానికి గురైన పాకిస్థాన్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) గట్టి దెబ్బ కొట్టింది. తాను ఇచ్చిన అప్పును వెంటనే చెల్లించాలని పాకిస్థాన్‌ను హెచ్చరించింది. గడువు సైతం విధించడంతో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ దిక్కుతోచని పరిస్థితిలోకి కొట్టుమిట్టాడుతున్నారు.

ఇక చేసేంది ఏం లేక మళ్ళీ భిక్షాటన ప్రారంభించారు. యూఏఈకి చెల్లించాల్సిన 3 బిలియన్ డాలర్ల కోసం పాక్ పాలకులకు గత్యంతరం లేక ఇతర దేశాల ముందు చేయి చాచుతున్నారు. ఒకవైపు జనరల్ ఆసిమ్ మునీర్ ఇరాన్ పర్యటనకు వెళ్లారు. అమెరికాఇరాన్ మధ్య యుద్ధాన్ని ఆపి, మధ్యవర్తిత్వం చేయడం ద్వారా చైనా, ఐఎంఎఫ్ (IMF), ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థల నుంచి తిరిగి రుణాలు పొందవచ్చనేది ఆయన ఎత్తుగడ. మరోవైపు ప్రధాని షెహబాజ్ షరీఫ్ సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే దేశాల చుట్టూ తిరుగుతున్నారు. సౌదీ అరేబియా వద్ద తమ దేశం ఎంత పేదరికంలో ఉందో వివరిస్తూ మొరపెట్టుకోవడంతో చివరికి వారు 3 బిలియన్ డాలర్ల అదనపు ఆర్థిక సాయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ 3 బిలియన్ డాలర్ల సాయంతో పాకిస్థాన్.. యూఏఈకి చెల్లించాల్సిన అప్పును వచ్చే వారం తీర్చనుంది. దీనికి తోడు ఇప్పటికే సౌదీ పాకిస్థాన్‌కు ఇచ్చిన 5 బిలియన్ డాలర్ల రుణ గడువును సైతం పొడిగించారు. వాస్తవానికి పాకిస్థాన్ వద్ద ప్రస్తుతం 17 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నప్పటికీ, వాటిని తాకలేని పరిస్థితి నెలకొంది. ఎందుకంటే ఐఎంఎఫ్ షరతుల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి నిల్వలు 18 బిలియన్ డాలర్లకు చేరాలి. ఒకవేళ సొంత నిల్వలు ఖర్చు చేస్తే ఐఎంఎఫ్ నుంచి వచ్చే రుణాలు ఆగిపోతాయి, తద్వారా చమురు, గ్యాస్ వంటి నిత్యావసరాల దిగుమతి నిలిచిపోయి దేశం అంధకారంలోకి వెళ్తుంది. అందుకే అప్పు తీర్చడానికి కూడా మరో కొత్త అప్పు చేయక తప్పని దుస్థితిలో పాక్ కొట్టుమిట్టాడుతోంది.




## తెలంగాణ వ్యతిరేకత బీజేపీ నరనరాన నిండి ఉంది

మొదటిపేజీ తరువాయి

చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ...బిజెపి చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తుపెట్టుకుంటుందన్నారు

తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని ఆయన గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు.

పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బిజెపి ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బిజెపి పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బిజెపి అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.



## తెలంగాణలో భానుడి విశ్వరూపం

మొదటిపేజీ తరువాయి

తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రాగల మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అధిక ఉష్ణోగ్రతలతో పాటు రాష్ట్రంలో ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని తెలిపింది. దిగువస్థాయి గాలుల్లో మార్పు, క్యూములోనింబస్ మేఘాలు, ద్రోణి ప్రభావాలతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

**19న ఉరుములు మెరుపులతో వర్షా లు**

ఈ నెల 19న జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. 20న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. వర్షం కురిసే అవకాశం ఉన్న జిల్లాలకు వాతావరణ శాఖ పసుపు రంగు హెచ్చరికలను జారీ చేసింది.

## డీలిమిటేషన్‌పై రేవంత్ తప్పుడు ప్రచారం

మొదటిపేజీ తరువాయి



విమర్శలు గుప్పించారు.

డీలిమిటేషన్ ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారాన్ని ఆయన పూర్తిగా ఖండించారు. కేరళ రాష్ట్రంతో పోలిస్తే తెలంగాణలో జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, లోక్‌సభ స్థానాలు మాత్రం తక్కువగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. కేరళలో 20 ఎంపీ స్థానాలు ఉండగా, తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో సీట్ల పెంపు విషయంలో వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి Revanth Reddy ముందుగా కేరళలో సీట్లను తగ్గించాలని కోరాలని రామచందర్‌రావు సూచించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనే జనాభా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు కేటాయించారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ భిన్నమైన వాదనలు చేయడం ఆశ్చర్యకరమని అన్నారు.

మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ అంశాలపై కాంగ్రెస్ నాయకత్వం ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని ఆయన విమర్శించారు. Rahul Gandhi కొత్త పార్లమెంట్ భవనంలోనే మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ అమలు చేయాలని కోరారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేయడం విరుద్ధ వైఖరిగా ఉందని అన్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాది రాష్ట్రాల్లో అలాంటి పరిస్థితి లేదని చెప్పడం వితండవాదమని రామచందర్‌రావు పేర్కొన్నారు. జనాభా ఆధారంగా సీట్ల పునర్విభజన చేయడం ప్రజాస్వామ్యానికి అనుకూలమని ఆయన అభిప్రాయపడ్డారు. జీఎస్‌డీపీ ఆధారంగా సీట్లు పెంచాలన్న వాదన సరైంది కాదని స్పష్టం చేశారు.

లోక్‌సభలో గందరగోళం సృష్టించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని కూడా ఆయన ఆరోపించారు. గతంలో జరిగిన సంఘటనలను గుర్తు చేస్తూ, సభలో పెప్పర్ స్ప్రే వంటి ఘటనలు పునరావృతం అయ్యే అవకాశం ఉందని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం సభా సంప్రదాయాలను దెబ్బతీసే చర్యలు తగవని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై వ్యంగ్యంగా స్పందించిన రామచందర్‌రావు, వీరిలో ఎవరికీ ఈ అంశంపై పూర్తి అవగాహన లేదని అన్నారు. ఒకరికి విషయ పరిజ్ఞానం లేక మాట్లాడుతున్నారా, లేక మరొకరు ఎక్కువ తెలుసుకుని మాట్లాడుతున్నారా అన్న సందేహం వ్యక్తం చేశారు.

డీలిమిటేషన్‌ను మొదట వ్యతిరేకించిన నాయకుల్లో తమిళనాడు ముఖ్యమంత్రి M. K. Stalin ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం దక్షిణాది ఉత్తరాది పేరుతో వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో సీట్లు పెరిగితే, ఉత్తరప్రదేశ్‌లో కూడా అదే స్థాయిలో పెరుగుతాయని ఆయన వివరించారు. గతంలోనే దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గాయని, ఇప్పుడు తగ్గుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనపై కూడా రామచందర్‌రావు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ సక్రమంగా జరగలేదని, తమ ప్రాంతంలో ఎన్యూమరేటర్లు కూడా రాలేదని పేర్కొన్నారు. కుల గణనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తరాదిలో కాంగ్రెస్ పార్టీ ప్రభావం తగ్గిపోయిందని, దక్షిణాదిలో కూడా అదే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో కూడా భాజపాకే ఎక్కువ లోక్‌సభ స్థానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణపై కూడా రామచందర్‌రావు స్పందించారు. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటున్నాయని, ఇది పరిపాలనపై ప్రభావం చూపుతోందని అన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు డీలిమిటేషన్ చేస్తే ఒక ఎన్నికను చూపిస్తారని, తర్వాత మరో ఎన్నికను కారణంగా చూపుతారని అన్నారు. ఈ నేపథ్యంలో దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. "ఒకే దేశంఒకేసారి ఎన్నికలు" అమలులోకి వస్తే ఎన్నికల ఖర్చు తగ్గడమే కాకుండా పరిపాలనలో స్థిరత్వం ఏర్పడుతుందని చెప్పారు.

మొత్తం మీద, డీలిమిటేషన్ అంశంపై జరుగుతున్న రాజకీయ వాదోపవాదాలు మరింత వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో భాజపా, కాంగ్రెస్ మధ్య విమర్శలు మరింత తీవ్రరూపం దాల్చాయి. రామచందర్‌రావు చేసిన తాజా వ్యాఖ్యలు ఈ చర్చను మరింత ఉత్కంఠభరితంగా మార్చాయి. రాబోయే రోజుల్లో ఈ అంశంపై రాజకీయంగా మరిన్ని పరిణామాలు చోటు చేసుకునే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## తేజస్వి సూర్యపై చర్యలు తీసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

ఇలాంటి కీలక అంశంపై స్పందించాల్సిన బాధ్యత ఆయనపై ఉందని, కానీ మౌనం వహించడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో పార్టీ రాజకీయాలను పక్కనపెట్టి మాట్లాడాల్సిన అవసరం ఉందని సూచించారు.

తెలంగాణను అవమానించే వ్యాఖ్యలు చేసిన ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్‌సభాధ్యక్షుడికి ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా మాట్లాడిన ప్రజాప్రతినిధి సభలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ప్రజలు తమ గౌరవాన్ని కాపాడుకునే సామర్థ్యం కలిగినవారని, అవమానించే వారిని వారు తగిన సమయంలో తగిన విధంగా స్పందిస్తారని మంత్రి హెచ్చరించారు. ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

భాజపా గత వైఖరిపై కూడా మంత్రి ప్రశ్నలు సంధించారు. 2001లో భాజపా మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసినప్పుడు తెలంగాణ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆ సమయంలో తెలంగాణ ప్రజల డిమాండ్‌ను ఎందుకు పట్టించుకోలేదని ఆయన నిలదీశారు. ప్రస్తుతం మాత్రం తెలంగాణపై వ్యాఖ్యలు చేయడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన అనేది కోట్లాది ప్రజల కల సాకారం కావడమేనని మంత్రి పేర్కొన్నారు. ఈ రాష్ట్రం ఏర్పాటుకు వెనుక ఉన్న చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేయడం సమాజానికి హానికరమని అన్నారు. యువతకు తప్పుదారి చూపే విధంగా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం జరిగే ప్రతి అంశంపై తాము గట్టిగా స్పందిస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ ఏర్పాటును అవమానించే వ్యాఖ్యలను అన్ని రాజకీయ పార్టీలూ ఖండించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదని, రాష్ట్ర గౌరవానికి సంబంధించిన అంశమని అన్నారు. తెలంగాణవాదులంతా ఐక్యంగా నిలబడి రాష్ట్ర గౌరవాన్ని కాపాడాలని కోరారు.





మొత్తం మీద, తెలంగాణ ఏర్పాటుపై వచ్చిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తతను పెంచుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఘాటు వ్యాఖ్యలు ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేశాయి. రాబోయే రోజుల్లో ఈ అంశంపై రాజకీయంగా మరిన్ని పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భీంగల్ మండల స్థాయి సమీక్షా సమావేశం గురువారం స్థానిక కార్యాలయంలో ఉత్సాహంగా జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగుల సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస రావు నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల అమలు తీరును అధికారులు ఈ సందర్భంగా వివరించారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న రకం వడ్ల కొనుగోలుకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలు మరియు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న కొత్త పథకాలైన అల్పాహార పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా స్కీమ్ గురించి సమావేశంలో ప్రస్తావించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు విస్తరించడం, దివ్యాంగ విద్యార్థులకు మోటారు వాహనాల పంపిణీ, పంటల వైవిధ్యీకరణ మరియు సేంద్రియ వ్యవసాయంపై రైతులకు దిశానిర్దేశం చేశారు. అరెవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ నియమాలను తు.చ తప్పకుండా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, యువకులు పాల్గొన్నారు.






# ఆటోమొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం.. రూ.6 లక్షల నష్టం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు సమీపంలో గురువారం ఉదయం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఒక ఆటోమొబైల్ దుకాణం పూర్తిగా దగ్ధమైంది. స్థానికంగా నివాసముండే ముబీన్‌కు చెందిన ఆయిల్, ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి షాపులోని సామగ్రి అంతా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి సుభాష్ ప్రాథమికంగా నిర్ధారించారు. ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసి పడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.



# నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

అనారోగ్యంతో ఆసుపత్రుల పాలై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ పేర్కొన్నారు. సాలూర మండల కేంద్రంలో గురువారం సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 3 లక్షల విలువైన చెక్కులను ఈ సందర్భంగా అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఆపద కాలంలో నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తోందని, ఇది బాధితులకు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 12 గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# రహదారులపై ధాన్యం ఆరబోయవద్దు : సీఐ విజయ్ బాబు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

రైతులు పండించిన ధాన్యాన్ని రహదారులపై ఆరబోసి వాహనదారుల ప్రమాదాలకు కారణం కావొద్దని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు సూచించారు. సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రహదారుల పక్కన ధాన్యం ఆరబోసిన సమయంలో వాహనదారులకు ముందస్తుగా తెలిసేలా ట్రాఫిక్ కోన్స్, రేడియం స్టిక్కర్లు వంటివి ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా రాత్రి వేళల్లో జరిగే ఘోర ప్రమాదాలను నివారించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను వివరిస్తూ.. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తారని, ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తులో వాహనం నడపరాదని హెచ్చరించారు. అతివేగం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. రోడ్లపై అజాగ్రత్తగా ధాన్యం పోయడం వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన హితవు పలికారు.



# నేరాల నియంత్రణపై సీపీ సమీక్ష

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

జిల్లాలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారంపై పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. కమిషనరేట్ కార్యాలయంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల ఏసీపీలు, సీఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు అరెవ్ అలైవ్ కార్యక్రమాన్ని అత్యంత నిక్కచ్చిగా అమలు చేయాలని ఆదేశించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన కొలిక్కి తీసుకురావాలని, దర్యాప్తులో జాప్యం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా నగరంలో పెరుగుతున్న సైబర్ మోసాలు, బ్యాంకింగ్ ఫ్రాడ్‌లు, ఆర్థిక నేరాల పట్ల కఠినంగా ఉండాలని సూచించారు. వైట్ కాలర్ నేరాల అదుపునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ సైన్ బోర్డుల ఏర్పాటుతో పాటు లింకు రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ఇంజినీరింగ్ లోపాలు ఉంటే సంబంధిత నేషనల్ హైవే, స్టేట్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని సరిచేయాలని సూచించారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజల్లో రోడ్డు భద్రతా నియమాలపై విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ జి.బస్వా రెడ్డి, ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



**ఆదిలాబాద్ జిల్లా, బోథ్, ఏప్రిల్ 16(డి డి 9వార్త)**

వివేకానంద పాఠశాల,సోనాల లో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో స్థానిక నేత్ర వైద్య సహాయకులు అందే రాజు గారి సహకారంతో నిర్వహించడం జరిగింది...పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ నేడు చాలామంది విద్యార్థులు ఎక్కువగా సెల్ ఫోన్ వినియోగం బాల్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోందని.., నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి దశ నుంచే సెల్ ఫోన్ల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించకపోతే వారి మానసిక ఎదుగుదలకు నష్టాన్ని చేకూరుస్తుందని అభిప్రాయపడుతున్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ... పుస్తకాలు, క్రీడలకు దగ్గరవుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. పుస్తక పఠనం, మొక్కల పెంపకం, క్రీడలు వంటి మంచి అలవాట్లకు దగ్గర కావాలని సూచిస్తున్నారు.ఫోన్ల వాడకానికి అలవాటు పడటంతో కంటి సమస్యలు వస్తున్నాయి,కావున వాటిని దృష్టిలో ఉంచుకొని ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. వీటిలో పదిమంది విద్యార్థులకు కంటి అద్దాలను సూచించారు.. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...





# వైద్య సేవలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి : డీఎంహెచ్ఓ బి.రాజశ్రీ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**


ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు, పల్లె దవాఖానాల పరిధిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఎప్పటికప్పుడు హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ ఆదేశించారు. బోధన్ డివిజన్ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, డీఈఓలకు గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణీల నమోదు, ఆసుపత్రి ప్రసవాలు, టీకాలు, మాతా శిశు మరణాలు మరియు జీవనశైలి వ్యాధుల పరీక్షలకు సంబంధించిన ప్రతి అంశాన్ని విధిగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ముఖ్యంగా ఎంసీహెచ్, హెచ్ఎంఐఎస్ పోర్టళ్లలోని గణాంకాలు ఒకేలా ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లాలో పెరుగుతున్న ఎండల దృష్ట్యా వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆశాలు ఇంటింటికీ వెళ్లి ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగవద్దని ప్రజలకు వివరించాలన్నారు. గర్భిణీలు, వృద్ధులు, చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటివి తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీఎం నారాయణ, హెచ్ఈఓ శ్రీనివాస్ శిక్షణ ఇవ్వగా, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వినయ్ కుమార్, వెంకటేష్, శ్రావ్య పాల్గొన్నారు.



# వ్యక్తి అదృశ్యం

- కోటగిరి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు
- ఎస్. ఐ డి సునీల్

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 16 (డిడి9వార్త)**



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని కొడిచర్ల గ్రామానికి చెందిన బీర్ల గంగారం తండ్రి నాగ్గొండ వయస్సు 62 సంవత్సరాలు కురుమ కులానికి చెందిన తను ఏప్రిల్ 4న ఇంటి నుండి బయలు దేరి ఇప్పటికి రాకపోవడంతో భార్య బీర్ల సాయవ్వ కోటగిరి పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

# బాల్య వివాహ రహిత పంచాయతీ

చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ గ్రామం గా ఎన్నికైన ధన్నూర్ బీ గ్రామం బోథ్ మండలంలో నాలుగు గ్రామాలు ఎన్నికవ్వడం జరిగింది. ఇందులో భాగంగా ప్రశంషా పత్రాన్ని గౌరవ ఎంపీడీఓ. ఎమ్మార్వో.కలిసి ధన్నూర్ గ్రామ సర్పంచ్ ఎల్మ రోహిణి వినయ్ రెడ్డీ ,ఉపసర్పంచ్ కారం సుజాత,పంచాయతీ కార్యదర్శి శిరీష,అంగన్వాడీ టీచర్స్ రమక్క, లలిత icps మమతా, icds supervisor మౌనిక, లలిత,గార్లకు అందించడం,జరిగింది. ధన్నూర్ గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ బాల్య వివాహం వంటి లోతుగా పాతుకుపోయిన దురాచారాన్ని ఎదుర్కోవడంలో. నమూనా ఒక మలుపు కాగలదని సామాజిక నిపుణులు భావిస్తున్నారు. పంచాయతీ స్థాయిలో అవగాహన, సామాజిక భాగస్వామ్యం మరియు పరిపాలనా నిబద్ధత ద్వారా సమాజం నిర్ణయం తీసుకుంటే మార్పు నిజంగా సాధ్యమేనని రుజువైంది. ఈ చొరవ బాల్య వివాహాలను అరికట్టడమే కాకుండా విద్య, బాలల హక్కులు, మహిళల ఆరోగ్యం మరియు లింగ సమానత్వాన్ని కూడా బలోపేతం చేసింది. సమాజం మార్పులో చురుకుగా భాగమైనప్పుడే చట్టాలు, పరిపాలనా చర్యలు నిజంగా ప్రభావవంతంగా ఉంటాయని . సామూహిక ప్రయత్నాల ద్వారా సామాజిక వైఖరులను మార్చడమే కాకుండా, శాశ్వత మార్పు దిశగా పటిష్టమైన చర్యలు కూడా తీసుకోవచ్చు. ఈ గుర్తింపును కొత్త శిఖరాలకు తీసుకువెళ్లడమే కాకుండా, దృఢ సంకల్పం, సామూహిక కార్యాచరణ ఉంటే హానికరమైన సామాజిక దురాచారమైన బాల్య వివాహాలను నిజంగా నిర్మూలించవచ్చనే శక్తివంతమైన సందేశాన్ని దేశవ్యాప్తంగా పంపుతుంది.






# పొతంగల్ సబ్ స్టేషన్లో నూతన విసిబి ఏర్పాటు

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 16 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని సబ్ సెక్షన్ పరిధిలోని పోతంగల్ గ్రామ సబ్ స్టేషన్ నందు సమ్మర్ యాక్షన్ ప్లాన్ కొరకు సబ్ స్టేషన్ లో గల ఆర్డ బ్ల్యూఎస్ ఫీడర్ను విద్యుత్ అంతరాయాలు కలుగకుండా నూతనంగా విసిబి ను ( విద్యుత్ నియంత్రికను ) ఏర్పాటు చేయడం జరిగినది. దానిని ప్రారంభించడానికి గౌరవనీయులైన బోధన్ డి ఈ శ్రీ ఎండి ముక్తార్ . రుద్రూర్ సబ్ డివిజన్ ఏడిఈ శ్రీ నవీన్ రెడ్డి. పోతంగల్ సెక్షన్ ఏఈ రాజేష్ . సబ్ ఇంజనీర్ ఫక్రుద్దీన్.ఎల్ ఐ గంగాధర్. విద్యుత్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన విసిబి ని ప్రారంభించడం జరిగినది.







# సాలూర మండల స్థాయి సమీక్షలో వెల్లువెత్తిన సమస్యలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

సాలూర మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమీక్షా సమావేశం అధికారుల వివరణలు, ప్రజాప్రతినిధుల నిలదీతల మధ్య సాగింది. సాలూర మండల ప్రత్యేక అధికారి పద్మ నేతృత్వంలో, ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన్ స్టాళ్లను అధికారులు పరిశీలించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యం కోసం పోషణ్ ప్రతిజ్ఞ చేయడంతో పాటు, రహదారి భద్రతా నియమాలను పాటిస్తామని ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల అమలు తీరును వివరించారు. త్వరలో రానున్న అల్పాహార పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా స్కీమ్ గురించి అవగాహన కల్పించారు.

అందని పరిహారం.. నిలిచిన పనులు సమావేశంలో క్షేత్రస్థాయి సమస్యలపై సర్పంచులు, రైతులు అధికారులను నిలదీశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నేటికీ పంట నష్టపరిహారం అందకపోవడంపై స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా, ప్రభుత్వం నుంచి సాయం అందడంలో జాప్యం జరుగుతోందని వాపోయారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మొరం దొరకక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని, మన ఇసుక వాహనం యాప్ పని చేయకపోవడంతో పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. పాత సాలంపాడు గ్రామంలో 71 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఏళ్లు గడుస్తున్నా పట్టాలు ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తమైంది. గ్రామాల్లో చేసిన పాత అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించకపోవడంతో కొత్త పనులు ముందుకు సాగడం లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, తహసీల్దార్ ఎంఏ నవాజ్ వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






# బోథ్ మండల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం.

**ఆదిలాబాద్ జిల్లా బోథ్,ఏప్రిల్ 16(డి డి వార్త ):-**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బోథ్ మండల స్థాయి సమావేశాన్ని బోథ్ మండల కేంద్రంలో ని షాదీఖానాలో నిర్వహించడం జరిగింది.ఇట్టి సమావేశంలో బోథ్ మండల సర్పంచులు, ఉపసర్పంచ్ లు,వార్డ్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు,అన్ని శాఖల మండల స్థాయి అధికారులు,అనధికారులు పాల్గొన్నారు.వివిధ శాఖల అధికారులు తమ శాఖల యొక్క ప్రగతి నివేదికను చదివి వినిపించారు. సమావేశ ఆవరణలో ఏర్పాటు చేసిన, ఐసీడీస్, వైద్య శాఖ,వ్యవసాయ శాఖ, వివిధ స్టాళ్లను సందర్శించి అధికారులు వివరించిన విషయాలను తెలియజేశారు. గ్రామం లొ అభివృద్ధి సర్పంచ్,ఉప సర్పంచ్ బాధ్యతలు వివరించారు. ప్రతి గ్రామం లొ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు కలిసి సమన్వయంతో ముందుకు సాగాలి అని అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుంది అని ఎంపీడీఓ రమేష్ తెలియజేసారు.వేసవి కాలం కావున విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు,ప్రమాదవశత్తు అగ్నినికి కాలిపోయిన ఇంటి యజమానులకు చెక్కులు పెండింగ్ లొ ఉన్నాయని తహసీల్దార్ అన్నారు.రోడ్డు సేఫ్టీ, ప్రమాదాలు మరణాల గురించి బోథ్ ఏస్ఐ వివరించారు. ప్రమాదాలు చాలా తక్కువ నమోదయ్యాయని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి అన్నారు. ఐసీడీఏస్ వారు నాలుగు గ్రామపంచాయతీలకు బాల్య వివాహల చేయని గ్రామాలకు అవార్డు అందజేశారు. కానీ సరిఅయిన సర్వే చేయక ఉండనే ప్రశంషా పత్రాలు అందజేశారని పలువురు సర్పంచ్ లు అన్నారు. మహిళా సర్పంచ్ భర్తలు



ఈ సమావేశం లొ హాజరు అవడంపలువురు సర్పంచ్ లు,ఉపసర్పంచ్ లు వ్యతిరేకించారు. అధికారులు ఏ హోదాలో ఆహ్వానం చేసారో అని వాపోయారు,ఉపసర్పంచ్ వ్యవస్థ నిర్వీర్యం చేసూన్నారు అని వారికీ సారి అయినా గౌరవం దక్కటం లేదు అని వాపోయారు. ఈ కార్యక్రమం లొ అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు హాజరు అయ్యారు.

# చిన్నరైతుల పై వివక్ష

**నిజామాబాద్ పొతంగల్ ఏప్రిల్16(డిడి9 వార్త):**


నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలం హంగర్గా ఫారం గ్రామంలో రైతులకు చాలా వివక్ష చూపుతున్నారని రైతులు వాపోతున్నారు చిన్న రైతులు అంటే మరీ చిన్నచూపు చూస్తున్నారని 20 రోజుల నుంచి ధాన్యం ఎండబోస్తున్నామని చిన్న రైతులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని బార్దాన్ సౌకర్యం కల్పించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చిన్న రైతులు వాపోతున్నారు, సంబంధించిన అధికారులు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



# అబ్దుల్ హమీద్‌కు ఘన సన్మానం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ గా పదోన్నతి పొందిన అబ్దుల్ హమీద్‌ను గురువారం హైదరాబాద్‌లోని హజ్ హౌస్‌లో కమ్మర్‌పల్లి మండల నాయకులు, మసీదు కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ హమీద్ ఉన్నత స్థాయి పదవిని చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. కమ్మర్‌పల్లి మసీదు కమిటీ అధ్యక్షుడు అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హమీద్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లికి చెందిన మొహ్మద్ అజీమ్, ఉప్లూర్ నాయకుడు బద్దం రాజారెడ్డి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన పోతంగల్ గ్రామసభ

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్16(డిడి9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా, పోతంగల్ మండల కేంద్రంలోని, గ్రామపంచాయతీ గ్రామ సభ నిర్వహించారు. మొదటి సమస్యతో ఏర్పాటు చేయడం జరిగింది పోతంగల్ బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఆటో స్టాండ్ ని వేరే ప్రాంతంలోకి మార్చాలని కోరారు. ఎందుకంటే బస్టాండ్లో ప్రయాణికులకు ఇబ్బంది అవుతుంది కాబట్టి అదే విధంగా గ్రామంలో ఉన్న రహదారులపై భారీ వాహనాలు ఇసుక వాహనాలు వెళ్లడం వలన ప్రయాణికులకు, దుకాణాలకు ఇబ్బంది అవుతుంది కాబట్టి రోజుకు రెండుసార్లు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రోడ్లపై నీళ్లను చెల్లించాలని స్థానిక గ్రామ సర్పంచ్ ని సెక్రటరీ గ్రామ ప్రజలు కోరారు. గ్రామంలో కొన్ని ప్రాంతాలలో నీటి సమస్య కూడా గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్ , ఉప సర్పంచ్ నబి, గ్రామపంచాయతీ సెక్రటరీ యాదవ్, వార్డ్ నెంబర్లు పంచ రెడ్డి అనిల్, మర్కెల్ సంతోష్, గంధపు సంధ్య, కల్లూరి వసంత, గజ్జల భారతి, తోకల శేఖర్, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





## సీబీఎస్ఈ ఫలితాల్లో క్షత్రియ విద్యార్థుల ప్రభంజనం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

సీబీఎస్ఈ 202526 పదో తరగతి ఫలితాల్లో క్షత్రియ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థుల విజయ కేతనాన్ని కొనియాడారు. విద్యార్థిని ఏనుగు ప్రణతి 500 మార్కులకు గాను 483 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, ముకుంద్ హర్షిణి 462 మార్కులతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాన్ని అలవరుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో మరింత స్ఫూర్తివంతమైన ప్రణాళికలతో మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పాఠశాల కరెస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను అందించడమే లక్ష్యంగా క్షత్రియ పాఠశాలను స్థాపించామని పేర్కొన్నారు. ఈ ఘన విజయం సాధించిన విద్యార్థులను, వారి కృషిలో భాగస్వాములైన ఉపాధ్యాయులను యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, డైరెక్టర్ అల్జాపూర్ వీరేందర్, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ఒకే సంస్థ - ఒకే రూల్ .. జీవో 11 అమలుకై విద్యుత్ కార్మికుల పట్టు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన సమ్మె గురువారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. నిజామాబాద్ సర్కిల్ కార్యాలయం ముందు నిర్వహించిన ఈ నిరసనలో దిచ్‌పల్లి, నిజామాబాద్ డివిజన్లతో పాటు ట్రాన్స్‌కో ఆర్టిజన్ కార్మికులు వందలాదిగా తరలివచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఒకే సంస్థలో అందరికీ ఒకే నిబంధనలు వర్తింపజేయాలని, విద్యార్హతలను బట్టి కన్వర్షన్ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. పీస్‌రేట్ వర్కర్లు, అన్‌మ్యాండ్ వర్కర్లు, మీటర్ రీడర్లను ఆర్టిజన్లుగా గుర్తించి సంస్థలో విలీనం చేయాలని కోరారు. ముఖ్యంగా జీవో నంబర్ 11 ప్రకారం ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలతో పాటు కనీస వేతనాన్ని ప్రకటించాలని పట్టుబట్టారు. ఈ సమ్మెకు 1104 యూనియన్ డిస్కమ్ ప్రెసిడెంట్ రఘునందన్ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులతో పాటు 500 మందికి పైగా కార్మికులు పాల్గొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.




## కీటక జనిత వ్యాధులపై సమరం

- నేటి నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ



**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 16 (డీడీ9 వార్త) :**

జిల్లాలో కీటక జనిత వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా నెల రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణను అమలు చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు కీటక జనిత వ్యాధులు, వడదెబ్బ నియంత్రణ, టీబీ ముక్త భారత్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సబ్ యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు క్షేత్రస్థాయిలో నాణ్యమైన సేవలు అందిస్తూ పరీక్షల సంఖ్యను పెంచాలని సూచించారు. మలేరియా పోర్టల్‌లో ఎంట్రీలు నిరంతరం చేయాలని, 'ఫ్రైడే డ్రై డే'ను పకడ్బందీగా నిర్వహించి వారంతపు నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. పర్యవేక్షక సిబ్బంది తమ పరిధిలోని ప్రాంతాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, పాత ఫైలేరియా వ్యాధిగ్రస్తుల జాబితాను సవరించి నివేదిక అందించాలని కోరారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించే ఈ 30 రోజుల కార్యక్రమంలో ప్రతిరోజు నివేదికలు సమర్పించాల్సి ఉంటుందని ఆమె వివరించారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ వినయ్ కుమార్, ఏఎంఓ షేక్ సలీం, సబ్ యూనిట్ అధికారులు, పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.

# టీమిండియాలోకి 15 ఏళ్ల సంచలనం?.. సూర్య, సంజూలకు టెన్షన్!

- భారత జట్టులోకి 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఎంట్రీపై జోరుగా చర్చ
- ఐపీఎల్ లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిలో పడిన యువ సంచలనం
- ఐర్లాండ్ పర్యటనకు ఎంపిక చేస్తే.. సంజూ, అభిషేక్ వంటి సీనియర్లకు చిక్కులు
- వైభవ్ ఎంపికతో ఫామ్‌లో లేని కెప్టెన్ సూర్యకుమార్‌పై పెరిగిన ఒత్తిడి
- 35 మంది సభ్యుల జాబితాలో వైభవ్ పేరు ఉన్నట్లు పీటీఐ కథనం




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారత క్రికెట్ జట్టులో ఓ పెను సంచలనం చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేవలం 15 ఏళ్ల వయసుకే తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్ సూర్యవంశీ త్వరలోనే టీమిండియాలోకి అరంగేట్రం చేయవచ్చనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో ఇప్పటికే రెండు అర్ధ సెంచరీలు బాదిన ఈ యువ సంచలనం, బీసీసీఐ సెలక్టర్లను బాగా ఆకట్టుకున్నాడు. రాబోయే ఐర్లాండ్ పర్యటనలో అతడికి అవకాశం దక్కవచ్చని ప్రచారం జరుగుతుండగా, ఈ పరిణామం సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వంటి సీనియర్ ఆటగాళ్లకు ఇబ్బందులు తెచ్చిపెట్టేలా ఉంది.

పీటీఐ కథనం ప్రకారం ఐర్లాండ్ పర్యటనకు వెళ్లే జట్టు కోసం వీసా ప్రక్రియ నిమిత్తం సెలక్టర్లు 35 మందితో కూడిన ప్రాథమిక జాబితాను సిద్ధం చేశారు. ఈ జాబితాలో వైభవ్ సూర్యవంశీ పేరు కూడా ఉన్నట్లు ఓ బీసీసీఐ అధికారి వెల్లడించారు. "జట్టు నేరుగా ఐర్లాండ్‌కు వెళ్లనున్నందున, యూకే వీసా సరిపోదు. అందుకే ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా ఐరిష్ వీసా అవసరం. దీనికోసం కనీసం 35 మంది ఆటగాళ్ల పేర్లను ఇవ్వాలని బీసీసీఐ లాజిస్టిక్స్ విభాగం కోరింది" అని ఆ అధికారి తెలిపారు.

అయితే, వైభవ్‌ను తుది జట్టులోకి తీసుకోవడం సెలక్టర్లకు కత్తి మీద సాములా మారింది. ప్రస్తుతం భారత జట్టులో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ రూపంలో ముగ్గురు అగ్రశ్రేణి ఓపెనర్లు ఉన్నారు. వీరంతా టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో అర్ధ సెంచరీలు సాధించిన వారే కావడం గమనార్హం. వీరితో పాటు యశస్వి జైస్వాల్ కూడా రేసులో ఉన్నాడు. ఈ నేపథ్యంలో నాలుగో ఓపెనర్‌గా వైభవ్‌ను తీసుకుంటే, వీరిలో ఒకరిని తప్పించాల్సి వస్తుంది.

ఈ ఎంపిక వ్యవహారం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్థానానికే ఎసరు పెట్టేలా ఉంది. 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత సూర్యకుమార్ పేలవ ఫామ్‌తో సతమతమవుతున్నాడు. అతని సగటు 20 కంటే తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో "వైభవ్ అరంగేట్రానికి సిద్ధంగా ఉన్నాడని సెలక్టర్లు భావిస్తున్నారు. కానీ, అభిషేక్ లేదా సంజూను తప్పించాలంటే బలమైన కారణాలు చెప్పాలి. వారిలో ఒకరిని తొలగిస్తే, ఫామ్‌లో లేని సూర్యకుమార్ జట్టులో ఎలా కొనసాగుతున్నాడనే ప్రశ్న తలెత్తుతుంది" అని సదరు బీసీసీఐ అధికారి వివరించారు. దీంతో యువ ప్రతిభకు అవకాశం ఇవ్వాలా? లేక ఫామ్‌లో ఉన్న సీనియర్లకే పెద్దపీట వేయాలా? అనే సంక్లిష్టమైన సవాలు ఇప్పుడు సెలక్షన్ కమిటీ ముందు ఉంది.

## ఈ బుడ్డోన్ని ఇప్పుడే టీమిండియాలోకి తీసుకుని తొందర పడకండి".. మాజీ కెప్టెన్ ఆసక్తికర వ్యాఖ్యలు..

**హైదరాబాద్, (డిడి9 వార్త):**




ఐపీఎల్ 2026 సీజన్‌లో అందరి చూపు ఓ కుర్రాడిపై ఉంది. ఆ కుర్రాడు ఎవరో కాదు.. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. తొలి మ్యాచుల్లో వైభవ్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కానీ.. సన్‌రైజర్స్ మ్యాచ్‌లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అయితే.. వైభవ్ త్వరలోనే తన కెరీర్‌లో మరో మైలురాయిని చేరుకోబోతున్నాడు. సీనియర్ భారత జట్టులోకి అరంగేట్రం చేసేందుకు ఎంపిక చేసినట్లు వార్తలు వచ్చాయి. ఐర్లాండ్ పర్యటన కోసం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ వైభవ్‌ను షార్ట్‌లిస్ట్ చేసినట్లు సమాచారం వెలువడింది. బెంచ్ స్ట్రెంత్‌ను పరీక్షించే ఉద్దేశంతో ఈ పర్యటనకు యువ ఆటగాళ్లను పంపాలని బీసీసీఐ భావిస్తోందట. ఒకవేళ వైభవ్ ఐర్లాండ్ సిరీస్‌లో బరిలోకి దిగితే సచిన్ రికార్డు చెరిగి పోతుంది. ఇదిలా ఉండగా.. టీమిండియాలోకి ఎంట్రీ వైభవ్ ఎంట్రీపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ స్పందించారు. ఓవైపు.. వైభవ్ ప్రతిభను కొనియాడుతూనే, అతడిని అంతర్జాతీయ క్రికెట్‌లోకి తీసుకువచ్చే విషయంలో తొందరపడవద్దని భారత సెలక్టర్లకు సూచించారు.

జూన్, జూలై నెలల్లో జరగబోయే ఐర్లాండ్ పర్యటన కోసం షార్ట్‌లిస్ట్ చేసిన 35 మంది ఆటగాళ్లలో వైభవ్ ఒకరన్న వార్తల నేపథ్యంలో ఫించ్ ఈ సలహా ఇచ్చారు. "భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అంటే ఒత్తిడి అధికంగా ఉంటుంది. ఇప్పుడు టీమిండియా ప్రస్తుత ఆటగాళ్లు ప్రపంచ కప్ గెలిచి, తమను తాము నిరూపించుకున్నారు. కాబట్టి వారికి గౌరవం ఇవ్వాలి. వైభవ్‌ను జట్టుతో ప్రయాణించనిచ్చి అక్కడి వాతావరణాన్ని అలవాటు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తే బాగుంటుంది. కానీ, ఏదైనా ఖాళీ ఏర్పడినప్పుడు లేదా ఎవరికైనా గాయాలైనప్పుడు మాత్రమే అతడిని బరిలోకి దించాలి. అతడిని ఒత్తిడికి గురిచేయకుండా తన సహజసిద్ధమైన ఆటను ఆడనివ్వాలి" అని ఫించ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## మ్యాచ్ సమయంలో 'దోశ, ఇడ్లీ, సాంబార్, చట్నీ' పాట... బీసీసీఐకి సీఎస్కే ఫిర్యాదు

- ఏప్రిల్ 5న జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ పాటను ప్లే చేయడంపై సీఎస్కే అభ్యంతరం
- పాటను ఉపయోగించే సమయం, సందర్భం సరికాదన్న సీఎస్కే
- మ్యాచ్ సమయంలో ఆ మీమ్స్‌ను ప్లే చేయడం సరికాదన్న సీఎస్కే

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఏప్రిల్ 5న జరిగిన మ్యాచ్ సందర్భంగా తమను అవమానించారని ఆరోపిస్తూ, చెన్నై సూపర్ కింగ్స్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి ఫిర్యాదు చేసింది. మ్యాచ్ సమయంలో స్టేడియంలో "దోశ, ఇడ్లీ, సాంబార్, చట్నీ" అనే పాటను ప్లే చేయడంపై సీఎస్కే అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ పాటను ఉపయోగించే సమయం, సందర్భం సరికాదని తన ఫిర్యాదులో పేర్కొంది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన ఆ మ్యాచ్‌లో బెంగళూరు విజయం సాధించింది. మ్యాచ్ సమయంలో "దోశ, ఇడ్లీ" అంటూ ఓ ట్రాక్‌ను డీజే ప్లే చేశారు. ఇది దక్షిణాది ప్రజలు ఎక్కువగా తినే ఆహార పదార్థాలు, ఇక్కడి వారి సంస్కృతిని ఎగతాళి చేసేలా ఉందంటూ సీఎస్కే ఆందోళన వ్యక్తం చేస్తూ, ఫిర్యాదు చేసింది. ఇలాంటి మ్యాచ్ సమయంలో ఆ మీమ్స్‌ను ప్లే చేయడం సరికాదని తమ ఫిర్యాదులో పేర్కొంది.




# క్రికెట్ హిస్టరీలో ఫస్ట్ టైమ్.. MCA ప్లేయర్స్ కి వార్షిక కాంట్రాక్టులు.. ఏకంగా రూ.20 లక్షలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారత క్రికెట్ హిస్టరీలో ఓ మైలురాయి. ముంబై క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంసీఏ 202627 సీజన్ నుండి తమ ఆటగాళ్లకు వార్షిక కాంట్రాక్టులను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ చర్య తీసుకున్న తొలి రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌గా నిలిచింది. MCA గ్రేడ్ A, B, C కింద కాంట్రాక్టులను అందించాలని నిర్ణయించింది. ఇటీవల జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదన ఆమోదం పొందింది. ఆటగాళ్లు సంవత్సరానికి రూ.8 లక్షల నుండి రూ.20 లక్షల వరకు అందుకుంటారు. గ్రేడ్ A ఆటగాళ్లు సంవత్సరానికి రూ.12 లక్షల నుండి రూ.20 లక్షల వరకు అందుకుంటారు. గ్రేడ్ బి ఆటగాళ్లకు సంవత్సరానికి రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు లభిస్తుంది. గ్రేడ్ సి ఆటగాళ్లకు రూ.8 లక్షలు లభిస్తాయి.



**MCA ఆటగాళ్లకు షరతులు**

MCA తన ఆటగాళ్ల కోసం కాంట్రాక్టు విధానాన్ని ప్రవేశపెట్టిన మొట్టమొదటి సంఘంగా నిలిచింది. అయితే, ఈ కాంట్రాక్టులను పొందగల ఆటగాళ్ల కోసం ఈ సంఘం కొన్ని షరతులను విధించింది. ఆటగాళ్లు తప్పనిసరిగా MCAలో నమోదు చేసుకుని ఉండాలి. సంఘం నిర్దేశించిన ఫిట్‌నెస్ ప్రమాణాలను పాటించాలి. గత రెండు సీజన్లలో ఏ ఫార్మాట్‌లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించని ఆటగాళ్లకు మాత్రమే ముంబై క్రికెట్ అసోసియేషన్ కాంట్రాక్టులు అందుబాటులో ఉంటాయి. ఆటగాళ్లు గత రెండు సీజన్లలో ఐపీఎల్ జట్టుకు ఎంపికై ఉండకూడదు. కాంట్రాక్టుల కోసం ఆటగాళ్లను ఎంసీఏ సెలక్షన్ కమిటీ సిఫార్సు చేస్తుంది.

రంజీ ఆటగాళ్లకు బీసీసీఐకి సమానమైన మ్యాచ్ ఫీజులు లభించనున్నాయి. ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తూ బాగా రాణిస్తున్న చాలా మంది ఆటగాళ్లు ఏ ఐపీఎల్ జట్టులోనూ భాగం కాలేదు. వారికి సహాయపడటానికి, ఎంసీఏ ఒక కొత్త గ్రేడ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. 2024లో, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుండి తమ రంజీ ట్రోఫీ క్రికెటర్లు అందుకునే మ్యాచ్ ఫీజులనే వారికి కూడా చెల్లించాలని ఈ సంఘం నిర్ణయించింది. ఒక క్రికెటర్ ఆడిన మ్యాచ్‌ల సంఖ్యను బట్టి, బీసీసీఐ చెల్లించే మ్యాచ్ ఫీజులు రోజుకు రూ.40,000 నుండి రూ.60,000 మధ్య ఉంటాయి.



# పెళ్ళైన మగవారు వేరే మహిళలను ఎందుకు ఇష్టపడతారో తెలుసా?

**పెళ్ళి అంటే జన్మజన్మల అనుబంధం. జీవితకాలం కలిసి వచ్చే తోడు. అయితే పెళ్ళి వరకు ఉన్న వ్యక్తి.. పెళ్లి తర్వాత మారిపోతారు. ఇది ఎక్కువగా పురుషుల్లో జరుగుతుంది. వివాహమైన ఏడు సంవత్సరాలకు పురుషుల ఆలోచనల్లో మార్పు వస్తుందని పలు అధ్యయనాలు చెపున్నాయి. పక్క చూపులు చూడటం మొదలవుతుందని.. ఫలితంగా చిన్న ఇల్లు అనే అంశం తెర్రపైకి వస్తుంటుందని అంటుంటారు. ఈ కోణంలో చాలా సినిమాలే వచ్చాయి! అయితే ఇలా మగవారు ఎందుకు మారిపోతారు అనే విషయాలపై పలువురి అభిప్రాయాలు ఎలా ఉన్నాయనేది ఇప్పుడు చూద్దాం!**



సాధారణంగా పెళ్ళికి ముందు చాలా మంది మగవారు చాలా స్వేచ్ఛగా ఉంటారని అంటున్నారు. చదువుకునే సమయంలోనూ, చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాలు చేసే సమయంలోనూ కాస్త స్వేచ్ఛగా ఉంటారని.. ఆ సమయంలో వారిపై ఎలాంటి ఆంక్షలు ఉండవని చెబుతున్నారు. ఈ సమయంలో పెళ్ళాయిన తర్వాత వారి స్వేచ్ఛ ఒక్కసారిగా ఎగిరిపోయిందనే ఫీలింగ్ కి లోకి వస్తారంట మగవారు. పైగా ఇదంతా బాధ్యతల వల్ల వచ్చిందనే విషయం మరిచి... దీనికి కారణం వారి భార్య అని భావిస్తారంట. ఈ సమయంలో వారి భార్యల్ని కాకుండా ఇతర మహిళలల్ని ఇష్టపడతారని అంటున్నారు.


shutterstock.com · 2056340957

ఇదే సమయంలో ప్రతి వ్యక్తికి వారి వారి పార్టనర్ విషయంలో కొన్ని ఊహలు ఉంటాయని.. నిజ జీవితంలో అలాంటి పార్టనర్స్ దొరకకపోయిన సందర్భంలో.. వారి ఊహలకు అనుగుణంగా ఉన్నవారిని వెతుక్కుంటూ అందులో సంతృప్తి పొందుతారని చెబుతున్నారు. సాధారణంగా పెళ్లైన మగవారికి ఏదైనా విషయంలో తృప్తి లేకపోతే వెంటనే దాని నుంచి దూరంగా ఉంటారట. అయితే వివాహ బంధంలో అలా జరుగదు కాబట్టి... ఈ రిలేషన్ లో భార్య నుంచి వారు కోరుకునే ఆనందం దొరకని సమయాల్లో... వేరే మహిళలకి అట్రాక్ట్ అవుతారని అంటున్నారు.

ఇదే క్రమంలో... ప్రతి భర్త కూడా భార్యలు తమని ఇష్టపడాలని, వారి గురించి అన్ని విషయాలు జాగ్రత్తగా చూసుకోవాలని, వారే లోకంగా భావించాలని కోరుకుంటారట. అయితే పెళ్లైన అనంతరం అలా జరుగని పక్షంలో భర్తలు.. భార్యల్ని కాకుండా వేరే మహిళల్ని కోరుకుంటారని తెలుస్తోంది.

# పకోడి ఇలా చేశారంటే అదిరిపోతుంది

చేపతో వండిన వంటకాలకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంటుంది. చికెన్ నచ్చుదు, మటన్ నచ్చుదు అనేవాళ్లు ఉంటారు కానీ చేప కూర నచ్చుదు అనేవాళ్లు చాలా అరుదు. అలెర్జీ వంటి మెడికల్ కారణాలతో చేపను తినకుండా ఉండటమే కానీ.. చేపంటో స్వతహాగా నచ్చని వారుండరు. కానీ చేపతో క్రిస్పీగా, క్రంచీగా, జ్యూసీగా చేసే వంటకాలు చాలా తక్కువ. వాటిని చేయడం కూడా అంత ఈజీ కాదని చాలా మంది భావిస్తున్నారు. అయితే చల్లటి వాతావరణం ఉందంటే బజ్జీలు, పకోడీలు తినాలన్న కోరిక ఉంటుంది. వాటినే చేపతో చేస్తే ఎలా ఉంటుందో ఆలోచించండి. ఊహించుకుంటే నోరూరిపోతోంది కదూ. మరి అలాంటి క్రిస్పీ, జ్యూసీ చేప పకోడీ ఈజీగా.. అదిరిపోయే టేస్ట్‌తో చేసుకోవచ్చు తెలుసా. దీన్ని చేయడం చాలా సులువు. బోన్ లెస్ చేప ముక్కలు కొనుక్కుంటే పకోడీ చేసుకోవడం చాలా ఈజీ.






## కావాల్సిన పదార్థాలు

చేపలు ముక్కలు అరకిలో
వెల్లుల్లి ఆరు రెబ్బలు
నిమ్మరసం అర స్పూను
కొత్తిమీర తరుగు మూడు స్పూన్లు
ఉప్పు రుచికి సరిపడా
కార్న్ ఫ్లోర్ రెండు స్పూన్లు
మిరియాల పొడి అర స్పూను
కారం ఒక స్పూను
నూనె డీప్ ఫ్రై చేయడానికి సరిపడా

## తయారీ విధానం..

చేప పకోడి చేసేందుకు తక్కువ ముల్లులున్న చేపలను ఎంపిక చేసుకోవాలి. చేపలను ముక్కలను కోసి మధ్యలో ఉన్న పెద్ద ముల్లును తీసేయండి. బోన్ లెస్ చేప ముక్కలు నేరుగా మార్కెట్లో దొరుకుతాయి. వాటిని తెచ్చుకుంటే పని ఇంకా సులువు అవుతుంది. ఒక గిన్నెలో ఈ చేప ముక్కలను వేసి కార్న్ ఫ్లోర్ పిండి, ఉప్పు, మిరియాలపొడి, కారం, నిమ్మరసం వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద కళాయి పెట్టి డీప్ ఫ్రైకి సరిపడా నూనె వేయాలి. నూనె వేడెక్కాక మ్యారినేట్ చేసుకున్న చేప ముక్కలు వేసి బంగారు రంగులోకి మారే వరకు వేయించాలి. చేపలు వేయించాక ఆయిల్ స్ట్రెయినర్ లో వేసి నూనె లేకుండా చూసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి ఒక స్పూను నూనె వేయాలి. అందులో సన్నగా తరిగిన వెల్లుల్లి రెబ్బలు, పచ్చి మిర్చి, కరివేపాకులు వేసి వేయించాలి. అందులో ఫిష్ పకోడా వేసి ఓసారి టాస్ చేసుకుని స్టవ్ ఆపేయాలి. అంతే టేస్టీ చేప రెసిపీ రెడీ అయినట్టే. నోట్లో పెడితే చాలు ఇక ఆపలేరు. మొత్తం తినేస్తారు. చేపలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చేపలతో చేసే వంటకాల్లో చేప పకోడీ చాలా రుచిగా ఉంటుంది. దీన్ని వండడం చాలా సులువు, దీన్ని ఎయిర్ ఫ్రైయర్లో వండితే చాలా తక్కువ నూనెతో వండేయచ్చు.



# మూత్రం ఆపుకుంటే శరీరంలో ఏమవుతుందో తెలుసా..?

మూత్ర విసర్జన కచ్చితంగా ప్రతీ జీవి చేయాల్సిందే.. సరైన విధంగా రోజూ ఇబ్బంది లేకుండా మూత్ర విసర్జన చేస్తేనే ఆ వ్యక్తి ఆ జీవి ఆరోగ్యంగా ఉన్నట్లు చెబుతారు, లేకపోతే అనారోగ్యంగా ఉన్నట్లే, అయితే మన శరీరంలోని వ్యర్థాలు అన్నీ మూత్రం ద్వారా బయటకు వస్తాయి అనేది తెలిసిందే..ఒంట్లో ఉన్న మలినాల్ని కడిగి తనతోపాటు బయటకి తీసుకెళ్ళే ద్రవ పదార్థమే మూత్రం. కాని కొందరు మాత్రం మూత్రం వెంటనే పోయరు , దానిని నిలిపివేస్తారు, ఇది చాలా డేంజర్ అంటున్నారు వైద్యులు, నిద్రపోయిన సమయంలో చాలా మంది మూత్రం వచ్చినా ఆపుకుంటారు. ఇది కూడా మంచిది కాదు అని చెబుతున్నారు వైద్యులు. మన మూత్రం శరీరంలోని టాక్సిన్స్ మలీనాల్ని సాధ్యమైనంతవరకు క్లీన్ చేస్తుంది... ఇది కిడ్నీల్లోంచి బ్లాడర్ లోకి వెళుతుంది. మన బ్లాడర్ ఎప్పుడు కూడా ఫుల్ అయితేనే మూత్రాన్ని బయటకి తోయమని ఫోర్స్ చేస్తుంది. మూత్రం వస్తోందన్నట్లు అనిపిస్తేనే అర్థం చేసుకోవాలి.. బ్లాడర్ ఫుల్ అయిపోతుంది దాన్ని ఖాళీ చేయాలి అని. ఇక ఇక్కడ మరో విషయం మన బ్లాడర్ లో 400 మిల్లీ లీటర్ల మూత్రం ఉంటుంది ,అది దాటితే కచ్చితంగా బ్లాడర్ మీద ఒత్తిడి పెరుగుతుంది అని చెబుతున్నారు వైద్యులు, ఇలా బ్లాడర్ లో సమస్యలు రావడానికి ఇదే కారణం అని చెబుతున్నారు వైద్యులు, అందుకే మూత్రం ఆపకండి అని చెబుతున్నారు.

